

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# కవిసత్కారం

**మా ఎదురింటి** చలపతి కవిత్వం రాస్తాడు. అది పత్రికలో పడినప్పుడంతా ఆ పత్రిక నాకిచ్చి చదవమంటాడు. మొదట్లో అభిప్రాయం అడిగేవాడు, నాకు కవిత్వం తెలియదని గ్రహించాక అడగడం మానుకున్నాడు. రెండుమూడేళ్లకోసారి తనకవితలన్నీ ఒక చిన్న పుస్తకంగావేసి మావీధిలో అందరికీ, వూర్లో తెలిసినవాళ్లకి పంచుతాడు. అలా నాకు ఐదారు పుస్తకాలిచ్చాడు.

'మనిషికి తను సృజించిందాన్ని ప్రపంచానికి చూపించాలన్న తపన ఉంటుందని, కళాకారులు ఒకడుగు ముందుకేసి సంఘంనుంచి గుర్తింపును ఆశిస్తారని ఎక్కడో చదివాను. నాకుతెలిసి మా చలపతికి అటువంటి గుర్తింపు ఇంతవరకు లభించలేదు. అదే అడిగాను మొన్నీమధ్య మరో పుస్తకం ఇచ్చినప్పుడు.

"రావల్సినచోట గుర్తింపు రావాలి. రానంతవరకు నా కవిత్వం బాగున్నట్టు కాదు" అన్నాడు

"నేనొప్పుకోను. యిప్పుడు గుర్తింపు వచ్చినకవులందరూ నీకంటే బాగా రాస్తున్నారా? గుర్తింపుకోసం నువ్వు మానవప్రయత్నం చెయ్యడం లేదు" అన్నాను.

"అలాంటివి నా కిష్టముండవు సూర్యం" అన్నాడు నిర్లిప్తంగా.

చలపతి అభిప్రాయాలు కొంచెం కటువుగావున్నా అతను నాకెప్పట్నుంచో మంచి మిత్రుడు. అతనిది మాయెదురిల్లు, అంటే బురుజునించి ఆరోయిల్లు. అతనికెలాగైనా సహాయం చేసి కవిగా గుర్తింపు తీసుకురావాలని నిశ్చయించుకున్నాను.

ఇదే విషయం మా ఆవిడ కామేశ్వరితో చెబితే ఆమెకూడా అదే మంచిదంది.

"అసలు కవులకు గుర్తింపు యెలావస్తుంది?" అనడిగా.

"భలేవాడివే, సన్మానాలు, బిరుదులు, అవార్డులు కవులకివ్వడం రోజూ పేపర్లో చూడ్డంలేదా? అవే మరి" అంది. కామేశ్వరి ఏదీ తిన్నగా చెప్పదు.

"అలాంటివాళ్లు నాకెవ్వరూ తెలియదే. మన వీధి సంక్షేమసంఘం పెద్దల సలహా అడుగుతా" అన్నాను.

"వాళ్లనా అడుగుతారు? దండగ పని. వాళ్ల కథ వేరే" అంది నిరసనగా.

"నీకు వాళ్లంటే పడదుగాబట్టి అలాగే అంటావు. వాళ్లకు మనవూర్లోనేకాదు, టౌన్లోకూడా యెంతో పలుకుబడివుంది. యిలాంటివాటికి సులభంగా యేర్పాట్లు చెయ్యగలరు" అన్నాను.

కామేశ్వరి ఒకసారి నవ్వి వంటింట్లోకెళ్లిపోయింది.

నేను ఇంట్లో పాతపుస్తకాల్లో వెతికితే చలపతి కవిత్వసంకలనాలు నాలుగైదు దొరికాయి. అవన్నీ చందస్సుగట్రా లేని గేయాలు. స్కూల్లో చదివిన పద్యాల్లాకాక తేటతెలుగులో ఉండి చాలావరకు అర్థమౌతున్నాయి. అక్కడక్కడా చిత్రమైన పదాలు, సంకేతాల్లాంటివి బోధపడ్డంలేదు. మొత్తానికి అవన్నీ రైతులు, పేదలు, అణగదొక్కబడినవారు, స్త్రీలు వీళ్లమీద సానుభూతితో రాసినవి. ప్రేయసి ప్రియులమీద, దేవుళ్లమీద, పండగలమీదగాని లేవు. కొంచెం చేదుగావున్నా నిజాలే చెప్పాడనిపించింది.

నేను ఎదురుచూస్తున్న అవకాశం రానేవచ్చింది. ఉగాది సందర్భంగా మా వీధి గుళ్లో జరపాల్సిన కార్యక్రమాలగురించి మా వీధి సంక్షేమసంఘం సమావేశానికి పిలుపొచ్చింది.

సమావేశం ఉదయం స్వామినాయుడి ఇంట్లో జరిగింది. స్వామినాయుడిది బురుజు వరసలో నాలుగోయిల్లు. పాతపెంకుటింటినే కొన్నిమార్పులుచేసి కొత్తరూపు తీసుకొచ్చాడు. ఇంటిముందు పక్కగా నేరేడుచెట్టు, పందిరికి బోగన్ విల్లా పూలతీగలు ఉంటాయి.

అది సెలవురోజుకాబట్టి మావీధిలో పిల్లలు అటుయిటూ పరిగెత్తడంతో, కూరగాయలు అమ్మేవాళ్ల అరుపులతో సందడిగావుంది. వీధి మొదట్లో బురుజెదురుగావున్న కచేరిసత్రంలో రెండు బిచ్చగాళ్ల కుటుంబాలు వేసుకుంటున్న కేకలు రాగయుక్తంగా వినబడుతున్నాయి. విశ్వమూర్తి, మురహరి ఇళ్లలోని మామిడిచెట్ల మీది కోయిలలు కవిసమ్మేళనం పెట్టుకున్నాయి.

నేవెళ్లేసరికి ఉపాధ్యక్షుడు నారాయణమూర్తే అధ్యక్షత న సమావేశం మొదలైంది. మామూలుగానే అధ్యక్షుడు రాయుడుగారు రాలేదు. పైవూరెళ్లడంవల్ల చలపతి రాలేదు. చెయ్యాల్సిన పూజలు, పంచాంగశ్రవణం, సాంస్కృతికకార్యక్రమాలను ముందుగా తేల్చారు. ఆపైన ఊళ్లో ఎవరెవర్ని పిలవాలో పట్టిక రాసారు. పంచాంగశ్రవణముంది కాబట్టి ఎప్పట్లాగే చుట్టుపక్కల పల్లెల్లో మావీధిపెద్దల పొలాలుచేసే కౌలురైతుల్ని, పనివాళ్లనీ పిలుస్తున్నారు.

"మనం యిదివరకు ప్రతి వుగాదిరోజు వొక కవికో, కళాకారుడికో సన్మానం చేసేవాళ్లం. ఆ సంప్రదాయం యీసారినుంచి మళ్లీమొదలెడితే యెలావుంటుంది?" అన్నాడు మూర్తి.

'బావుం'దని అందరూ బలపరిచారు. ఎవరికి సన్మానం చేద్దామనే చర్చ మొదలైంది.

"యెవరో యెందుకు? మనవీధిలోని మన చలపతి కవేగదా!" అన్నాను నేను.

అందరూ ఒక్కనిముషం మౌనంగావుండి తర్వాత ఇబ్బందిగా నావైపు చూసారు.

"మన చలపతి కవే, నిజమే, యెవరుకాదన్నారు? కానీ యితనేవో గేయాలు రాస్తాడు. కవిత్వమంటే అదివేరు" అన్నాడు ధనరాజ్ నవ్వుతూ.

"వాక్యం రసాత్మకం కావ్యం' అన్నాడు విశ్వనాథ లాక్షణికుడు. గేయమైనా కవిత్వం కాదనలేము. గురజాడ శ్రీశ్రీ మహాకవులేగదా" అన్నాడు కాశీపతి. అతని మాటలెవరూ పట్టించుకోలేదు.

"పూర్వ మహాకవుల ధోరణిలోవుంటేనే అది యింపైన కవిత్వం. రోజూ మాస్కూల్లో తెలుగు మాస్టరు ఆపద్యాలు పాడుతూంటే పక్కక్లాసులన్నీ ఆగిపోతాయి. చలపతి పుస్తకాల్లో కథ, యింపైన కవిత్వం కనిపించవు" వివరించాడు స్వామినాయుడు.

"చలపతి గేయాలు బాగానే ఉంటాయిగాని మనకు సంబంధంలేని యెవరిగురించో రాస్తాడు, కవిత్వమంటే కాస్త భక్తి, ముక్తి వుండాలిగదండీ. మనం చిన్నప్పుడు కవులు చందోబద్ధంగా, ధారగా ఆశుకవిత్వం చెప్పేవాళ్లు. యిప్పుడు నాలుగుపదాలు చేర్చి దాన్నే కవిత్వమంటున్నారు" చెప్పాడు సోమయాజులు.

మిగతా పెద్దలందరూ చలపతిది కవిత్వంకాదనే అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

"నేనతని కవిత్వం చదివాను, మంచికవితలు రాసాడు" అన్నాన్నేను కొంచెమావేశంగా.

"చలపతి మనవీధివాడు, మనకంతా మిత్రుడు. కానీ యీ వుగాది, సన్మానం యివి వేరు. అతనిసంగతి తరువాతెప్పుడైనా చూద్దాంలే" నన్ను సముదాయించాడు మూర్తి.

ఆతరువాత వాళ్లు నన్ను పట్టించుకోకుండా అర్హులైన కవులను వెతకడాన్ని కొనసాగించి చివరకు టౌన్లో ఉండే త్రిగుణశ్రీ అనే కవిని ఎంపిక చేసారు. అతనికి ఈమధ్యకాలంలో అనేక సన్మానాలు చేసార్ట, బిరుదులు వచ్చాయిట.

మా సమావేశం ముగిసి నేనింటికెళ్లాక జరిగింది కామేశ్వరికి చెప్పాను.

"నేచెప్పలేదా మీవాళ్లు చలపతన్నయ్యను కవిగా పరిగణించరని" అంది కామేశ్వరి.

"వాళ్ల మాటల్లోకూడా నిజముంది. చలపతి యీ వుగాది సన్మానాలకి సరిపోడులే. యిలాంటివాటికి మనిషి త్రిగుణశ్రీలా సంప్రదాయంగారాసి పద్యాలుగట్రా పాడాలి" అన్నాను

కామేశ్వరి పకపకా నవ్వి "నీకు గుర్తురాలేదా, యీ త్రిగుణశ్రీ మీ చుట్టమే, రామభద్రయ్య" అంది. అప్పుడు ఆయనెవరో నాకు వెలిగింది.

మా పెద్దల గౌరవానికి, సన్మానానికి అర్హుడైన కవి మా చుట్టమే కావడం నాక్కొంచెం గర్వంగా అనిపించింది.

రామభద్రయ్య మా చుట్టమే అని మా సంఘపెద్దలకు తెలియగానే ఉగాదిరోజు టౌనుకెళ్లి ఆయన్ను తీసుకురావడం, మధ్యాహ్నభోజన ఏర్పాట్లు, తిరిగి టౌన్లో వాళ్ళింటిదగ్గర దింపడం నాకే అప్పజెప్పారు.

ఆయన్నిదివరకు నేను ఫంక్షన్లలో కలిసినా మేమెప్పుడూ కవిత్వంగురించి మాట్లాడుకోలేదు. 'ఇదీ ఒకందుకు మంచిదే, చలపతికి సాయంజెయ్యమని అడగొచ్చు' అనుకున్నాను.

ఉగాది రానేవచ్చింది. ఆరోజు పొద్దున్నే తలస్నానం, ఉగాదిపచ్చడి సేవనం, పలహారం అయ్యాక టౌనుకు వెళ్లి ట్యాక్సిలో రామభద్రయ్యను ఇంటికి తీసుకొచ్చాను. భోంచేసాక ఆయనకు చలపతి పుస్తకాలిచ్చి అతనిగురించి చెప్పాను.

ఆయన ఆవలిస్తూ "ప్రయాణంలో అలసిపోయాను సూర్యం, విశ్రాంతి తీసుకుంటాను. వొకపని చేద్దాం, పుస్తకాలు నాతో యింటికి పట్టుకెళ్తా. తీరిగ్గా చదివాక నీకు ఫోన్ చేస్తాను" అన్నాడు.

ఈపుస్తకాలు చదివితే ఆయన సాయంత్రం చలపతిగురించి సభలో మంచిగా చెబుతాడని ఆశించిన నేను నిరాశ చెందినా "సరే" అన్నాను.

నిద్రలేచి టీ తాగాక రామభద్రయ్య తను మాట్లాడబోయే ఉపన్యాసపు కాగితాల్ని చూసుకున్నాడు. తన బ్యాగులోంచి జరీపట్టుపంచె, కండువా, సిల్కుజుబ్బా తీసి తొడుక్కున్నాడు. బంగారు కడియం, ఉంగరాలు పెట్టుకున్నాడు, గొలుసు, రుద్రాక్షమాల వేసుకున్నాడు. కామేశ్వరిని నీళ్లడిగి నుదుట పెద్ద గంధంబొట్టు, దానిమీద కుంకుమబొట్టు పెట్టుకున్నాడు. నేనలా కళ్లప్పగించి చూస్తూండగానే ఆయన రూపం మారిపోయింది.

నేను వంటింట్లోకి వెళ్లేసరికి కామేశ్వరి చాటుగా నవ్వాపుకోవడానికి ప్రయత్నిస్తోంది.

"అది మర్యాదకాదు. ఆయన రూపం ఆయనిష్టం" అన్నాను చిన్నగా.

"వ్యక్తిగతంగా ఆయనెలావున్నా నాకే అభ్యంతరం లేదు. కానీ యిలాంటి వేషాల్తో ఆడవాళ్లకు పేచీవుంది. తర్వాత చెప్తా" అంది. కామేశ్వరెప్పుడూ అంతే, సగమే చెప్తుంది.

మా వీధిచివర నదివొడ్డునున్న మార్కండేశ్వరస్వామి గుడిముందు షామియానావేసి పెద్ద సభ ఏర్పాటుచేసారు. గుడినుంచి కచేరిసత్రంవరకు, రాయుడుగారిమేడనుంచి బురుజువరకు వీధిమొత్తానికి సీరియల్ లైట్లు పెట్టారు. మాబురుజువీధికి, మా సంఘానికి సాంస్కృతికంగా ఉన్న పేరుప్రతిష్టలవల్ల ఊళ్లోని పెద్దమనుషులతో ఆవరణ నిండిపోయింది.

సాయంత్రం ఐదుకే కార్యక్రమం మొదలైంది. పంచాంగపండితుడు గ్రహగతులను బట్టి రాబోయేసంవత్సరం ఎలావుంటుందో, రైతులు ఏమేమి చేయాలో పంచాంగం చూసి చెప్పాడు.

“అదేమన్నా వ్యవసాయశాఖవారి సూచనాపత్రమా" అన్నాడు చలపతి నాతో చిన్నగా.

"మనశాస్త్రాలను తక్కువగా అంచనా వేయకు" అన్నాను.

చివరగా త్రిగుణశ్రీగారి ఉపన్యాసం వచ్చింది. ఆయన జిగేలుమంటున్న తన ఆహార్యంతో లేచి నిలబడగానే చప్పట్లు మోగాయి. ఆయన ఉత్సాహంగా ఒక పద్యంతో ఆరంభించి అనేక సంస్కృత, తెలుగు కావ్యాల్లోనుంచి శ్లోకాలు, పద్యాలు శ్రావ్యంగా పాడి ఉదహరిస్తూ మన ప్రాచీన ధర్మం, సంప్రదాయాలయొక్క ఔన్నత్యంగురించి అనర్గళంగా గంటన్నరసేపు ఉపన్యసించాడు. శ్రోతలు మధ్యన చప్పట్లు కొడుతూనే ఉన్నారు. ఆయన మా గుడిలోని

మార్కండేశ్వరస్వామి, మాసంక్షేమసంఘం, మావీధి, మావూరు వీటన్నిటి గొప్పదనంమీద ఆశువుగా పద్యాలుచెప్పి ముగించాడు. సభ కరతాళధ్వనులతో దద్దరిల్లింది. విన్నంతసేపూ అందరికీ వొళ్లు పులకరించింది. అనంతరం సభాధ్యక్షులు రాయుడుగారు సంఘంతరఫున ఆయనను పట్టుశాలువ, పూలదండలు, వస్త్రాలు, ఉంగరము, నగదు, జ్ఞాపికలతో సత్కరించారు.

సభను గొప్పగా నిర్వహించారని మా సంఘపెద్దల్ని వూరిపెద్దలు అభినందించారు. సభానంతరం రైతులకు, పనిచేసేవాళ్లకు షామియానాలో, మాకందరికి ధనరాజ్ ఇంట్లో భోజనాలు ఏర్పాటు చేసారు. మావీధి 'పరోపకారి' పాండురంగ, అతని భార్య సుశీలకు షామియానలో భోజనాల అజమాయషిని అప్పజెప్పారు.

"త్రిగుణశ్రీ, అదే మన రామభద్రయ్య, యెంతగొప్పగా మాట్లాడాడు! శ్లోకాలు, పద్యాలు యెంత శ్రావ్యంగా అనర్గళంగా పాడాడు!" అన్నాను కామేశ్వరితో భోజనాలప్పుడు.

" వినడానికైతే శ్రావ్యంగా వున్నాయిగాని వొక్కపద్యానికైనా నాకర్థం తెలియలేదు. వాటిగొప్పదనం నాకెలా తెలుస్తుంది" అంది.

"నువ్వెప్పుడూ యింతే. మనపెద్దమనుషులంటే గిట్టక మంచివి ఆనందించడం వొదిలేసి విమర్శిస్తూంటావు" అన్నాను. తనేదో చెప్పబోయిందిగాని ఇంతలో మావీధి 'వార్తల వనజమ్మ' మాకేసి వస్తూండడంతో చెరోవైపు వెళ్లాము.

రామభద్రయ్య ఆరాత్రి మాయింట్లోనే విశ్రాంతి తీసుకున్నాడు. పొద్దున్నే బయల్దేరేముందు చలపతి పుస్తకాలను ఆయన సంచిలో పెట్టాను. ఆయన్ను టౌన్లో దింపాక మళ్లీ చలపతిగురించి గుర్తుచేసాను.

టౌన్నుంచి తిరిగొచ్చాక జరిగిందంతా చలపతికి చెప్పాను. అతను నవ్వి ఊరుకున్నాడు.

మూడువారాల తర్వాత రామభద్రయ్యకు ఫోన్ చేసి చలపతి పుస్తకాలగురించి అడిగాను. ప్రోగ్రాముల ఒత్తిడివల్ల చూడలేదన్నాడు. వారంతర్వాత అతనే చేసాడు.

"నువ్వోసారి అతన్ని మాయింటికి తీసుకు రాగలవా?" అనడిగాడు.

నేను ఉత్సాహంగా ఆరోజే చలపతికి ఈమాట చెప్పాను. అతను మొదట్లో ఒప్పుకోలేదు. నేను పట్టువదలకపోవడంతో అవార్డులు గట్రా కాకుండా రామభద్రయ్య అభిప్రాయం వినడానికైతే వస్తానన్నాడు.

కామేశ్వరికి ఈవిషయం చెప్పి "రామభద్రయ్యే రమ్మన్నాడంటే నా ప్రయత్నాలు ఫలిస్తున్నట్టే" అన్నాను.

కామేశ్వరి నవ్వి "చలపతన్నయ్య రాసేవాటికి, వుగాదిరోజు రామభద్రయ్య వుపన్యాసానికి పోలికుందా? మిమ్మలెందుకు రమ్మన్నాడో నాకు బోధపడ్డం లేదు" అంది.

"నామాట నిజమౌతున్నందుకు నీకు వుక్రోషం, అంతే" అన్నాన్నేను నవ్వి.

ఆ ఆదివారం నేను, చలపతి టౌన్లో రామభద్రయ్య ఇంటికెళ్లేసరికి మధ్యాహ్నామైంది. మమ్మల్ని సాదరంగా పలకరించి హాలుపక్కనేవున్న ఆయన గదిలోకి తీసుకెళ్లాడు.

ఆగదిని నేను కళ్లప్పగించి చూసాను. లైబ్రరిలాగ చుట్టూ గోడలకానించి చెక్కబీరువాలు, వాటినిండా పుస్తకాలున్నాయి. బీరువాలపైన జ్ఞాపికలు, ఫ్రేముకట్టిన సన్మాన పత్రాలు, ప్రముఖులతో తీసుకున్న ఫోటోలు ఇలాంటివి క్రిక్కిరిసివున్నాయి.

మేం కూర్చున్నాక ఆయన శ్రీమతి శ్యామలమ్మ వచ్చి మజ్జిగఇస్తూ క్షేమసమాచారాలు అడిగి 'మాభోజనాలు అక్కడే' అని చెప్పివెళ్లింది. చలపతి మొహమాటపడ్డా పట్టించుకోలేదు.

టీపాయ్ మీద నేనిచ్చిన చలపతి పుస్తకాలున్నాయి.

"మీ కవితలన్నీ చదివానండీ చలపతిగారు, చాలా బావున్నాయి" అన్నాడాయన

బహుశా ఇది ఊహించలేదేమో, చలపతి కొంచెం తడబడి "థ్యాంక్సండి" అన్నాడు.

వెంటనే నేనందుకుని చలపతికి తగిన గుర్తింపు లేకపోవడం, ఏ బహుమతి, అవార్డు రాకపోవడం, సత్కారాలేవి జరగకపోవడం ఇవన్నీ వివరించి "మీరూ మెచ్చుకున్నారు, సంతోషం. యీవిషయంలో మీరేమైనా సహాయం చేస్తారేమోనని తీసుకొచ్చాను" అన్నాను.

నేను చెప్తున్నప్పుడు చలపతి కొంచెం ఇబ్బందిగా కదలడం ఆయన గమనించాడు.

రామభద్రయ్య కాసేపు మౌనంతర్వాత "ప్రతి కవీ సమాజహితంకోరే వొక ద్రష్ట. గుర్తింపు కోరుకోవడం అతని ప్రాధమికహక్కు. అలా అనుకోకపోవడమే అసహజం" అన్నాడు.

"అదే నేనూ చెప్తూంటానండి" అన్నాను.

ఆయన నామాటలు పట్టించుకోనట్టుగా "మీ కవిత్వంలో గాయపడిన మనుషుల మానసికవేదన, మోసపోయిన వ్యక్తుల ఆక్రోశం, దెబ్బతిన్న స్త్రీల ఆవేశం వున్నాయి. మీరు మీహృదయ స్పందననే కవిత్వంగా చక్కగా రాసారు, నిజమైన యేకవైనా అంతే" అన్నాడు.

రామభద్రయ్యమీద తన అపోహలు తొలగినట్టుగా చలపతిమొహం విప్పారింది.

రామభద్రయ్య దీర్ఘాలోచనలో ఉన్నట్టుగా కాస్సేపు కళ్లుమూసుకున్నాడు. తర్వాత కళ్లుతెరచి చలపతివైపు చూసి "మీకు మీకిష్టమైన కవిత్వం రాసుకుంటే వచ్చే తృప్తికావాలా? లేక గుర్తింపు కావాలా?" అనడిగాడు.

చలపతి అర్థంకానట్టుగా ఆయనవైపు చూసాడు.

"ఆరెండూ వేరెందుకౌతాయి? మీకు రెండూవున్నాయిగా?" అన్నాను.

ఆయన లేచివెళ్లి ఓ బీరువాతెరిచి అడుగుఅరలోంచి ఒకకట్ట సన్నటి పాతపుస్తకాలు, మరో పై అరనుంచి ఇంకో కట్ట లావైన కొత్త పుస్తకాలు తీసుకొచ్చి టీపాయ్ మీద పెట్టాడు.

ఆయన మొదట పాతపుస్తకాల కట్ట విప్పదీసి మాకు కొన్ని పుస్తకాలిచ్చి చూడమన్నాడు. అవన్నీ రామభద్రయ్య కవితాసంకలనాలు. ఇరవైయేళ్ల కిందట స్వంతంగా ప్రచురించుకున్నవి. లోపల చూస్తే చలపతి రాసిన కవితల్లాగే ఉన్నాయి. అన్నీ పీడిత, తాడిత జనాలమీద రాసిన గేయాలే. చందోబద్ధమైన పద్యాలు లేవు.

తరువాత రెండోకట్ట తీసి చూడమన్నాడు. అవీ రామభద్రయ్యవే. ఐతే అవన్నీ చందోబద్ధమైన పద్యాలున్న కావ్యాలు. దళసరి రంగుల బొమ్మల అట్టలతో లోపల మెరుస్తున్న మంచి కాగితాలతో ఉన్నాయి. అవన్నీ అనేక ధార్మిక సంస్థలు గత పదేళ్లగా ప్రచురించినవి.

"నేను మొదటి పది సంవత్సరాలు మీలాగే రాసాను. కష్టాల్లోవుండి అప్పులుచేసి స్వంతంగా ప్రచురించుకున్నాను. ఆ తరువాత అవి మానేసి యీ పదిహేనేళ్లనుంచి వేరేగా సంప్రదాయ కవిత్వం రాస్తున్నాను. వీటిని ప్రచురించడానికి సంస్థలు ముందుకురావడమేకాక నాకు రాయల్టిద్వారా ఆదాయంకూడా వస్తోంది. యిలా రాయడంకోసం ఐదేళ్లు కష్టపడి సంస్కృతం, తెలుగు వ్యాకరణం మళ్లీ మొదట్నుంచి నేర్చుకుని కావ్యాలుచదివి వాటిమీద పట్టు సంపాయించాను" అన్నాడు చుట్టూ బీరువాల్లోవున్న గ్రంధాలను చూపిస్తూ.

"అలా యెందుకు మారాల్సొచ్చింది?" అన్నాడు చలపతి. ఇంతలో శ్యామలమ్మ వచ్చి 'భోజనాలకు లేవ'మంది. "భోజనాలయ్యాక మాట్లాడుకుందాం" అని ఆయన లేచాడు.

శ్యామలమ్మ వడ్డించిన రుచికరమైన భోజనం చేసాక, ఆమెకు ధన్యవాదాలు తెలిపి గదిలోకొచ్చాము. వెనకాలే ఆయన తాంబూలంపళ్లెంతో వచ్చికూర్చున్నాడు.

తమలపాకులను యేరి కొసలుతుంచుతూ "భవభూతి తన కావ్యం 'ఉత్తర రామాయణం' రాసాక, 'చదివి అభిప్రాయం చెప్ప'మని దాన్ని కాళిదాసుకు పంపిన కథ తెలుసా? అందులో సున్నానికి చాలా పాత్రవుంది" అంటూ సున్నం రాసి, వక్కపొడివేసి ఆకులు చుట్టి చలపతికిస్తూ "మన పూర్వకవులు సామాన్యులు కాదండోయ్, మహా లౌక్యులు. యిహమూ పరమూ కలిసొచ్చేట్టు కావ్యాలు రాసారు" అన్నాడు.

చలపతి తాంబూలం తనకలవాటు లేదన్నాడు. నేనుకూడా వద్దంటే బావుండదని మొహమాటపడి తీసుకున్నాను.

"పరము సరే, వారి యిహంలోకి సామాన్యప్రజలు చేరలేకపోయారు. అదే జరిగివుంటే అవి కావ్యాలేకాక గొప్ప చరిత్రగ్రంధాలుకూడా అయ్యుండేవి" అన్నాడు చలపతి.

“అప్పటికవులకు మరోమార్గంలేదు. యేదియేమైనా భాషకు వాళ్లవల్ల గొప్ప అభివృద్ధి, సునిశితత్వం వచ్చాయి” సర్దిచెప్పాడు రామభద్రయ్య

“వాటి గొప్పదనాన్నిచూసి మీరు సంప్రదాయకవిత్వంలోకెళ్లారా?” అనడిగాను.

"నేను సంప్రదాయ కవిత్వంవైపు ఎందుకెళ్లాను అన్నది నా వ్యక్తిగత విషయం. ప్రస్తుతానికి అప్రస్తుతం. చర్చ చలపతిగారి కవిత్వం గురించి. గుర్తింపు, తృప్తి రెండూ వొకేసారి యెందుకురాకూడదు అన్నది ప్రశ్న. అంతేనా?” అన్నాడు మృదువుగా.

అంగీకారసూచకంగా తలవూపాము. ఆయన తన తాంబూలాన్ని సేవించాక అడిగాడు.

"చలపతిగారూ మీరు మీ కవితల్లో యెవరిగురించి రాసారు?"

"మీరూ చదివారుగా. రైతులు, శ్రామికులు, స్త్రీలు, అణగదొక్కబడినవారు, బాధితులు వీళ్లందరిమీదా" అన్నాడు చలపతి.

“వాళ్లు మీ కవిత్వాన్ని చదివి అర్థంచేసుకోగలరా? మీరు వాళ్లభాషే వాడారా?"

"అర్థంచేసుకోలేరు. బాష వాళ్లదికాదు. పాటలైతే వాళ్లు అర్థంచేసుకొని పాడుకోగలరు. కానీ చదువుకున్న యువకులు, సాహిత్యప్రియులు నాకవితల్ని అర్థం చేసుకుని గుర్తించగలరు"

"చదువుకున్న ఆధునిక సాహిత్య పిపాసులను కాస్సేపు పక్కన పెడదాం. మీరు యెవరికోసమైతే రాస్తున్నారో వాళ్లు అర్థంచేసుకోలేరు, గుర్తించలేరు. పోనీ వాళ్లు సంపన్నులా? మీలాంటి కవులను పోషించగలరా? సత్కరించగలరా?”

"వాళ్లకే తినడానికి లేదు" అడ్డంగా తల ఊపి అన్నాడు చలపతి.

"యిది ఆఖరు ప్రశ్న. యిప్పుడు యెవరైతే సంపన్నులుగావుండి కళను పోషించగలరో వాళ్లు నమ్మే ధర్మాన్ని మీ కవితలు బలపరుస్తున్నాయా? ప్రశ్నిస్తున్నాయా?"

"ప్రశ్నిస్తున్నాయి"

"నేను చెప్పదల్చుకున్నది మీకీపాటికే అర్థమైవుంటుంది. యిక ఆలోచించుకోవాల్సింది మీరే” అన్నాడు రామభద్రయ్య

చలపతికి సంగతేమోగాని నాకుమాత్రం ఆయనేం సలహా ఇచ్చాడో అర్థమైంది.

“మరి మీరు రాసే పద్యాలు మిమ్మల్ని గౌరవించేవాళ్లందరికీ అర్థం కావడంలేదుకదా" అన్నాను నేను కామేశ్వరి మాటల్ని గుర్తుకు తెచ్చుకుని.

రామభద్రయ్య గలగలా నవ్వి “బ్రిటీషువాడెళ్లిపోయి డెబ్బైయేళ్లైనా రాజభాషింకా ఆంగ్లమే! ఏదేశంలోనైనా సంప్రదాయాల్ని, ఆచారాల్నీ అర్ధంచేసుకునే పాటిస్తున్నారా? పాలకులు, పోషకులు ఏ సంప్రదాయాన్ని నమ్ముతున్నారన్నదే ముఖ్యం.” అని “యిప్పటికీ చర్చను ఆపి మరోసారెప్పుడైనా కొనసాగిద్దాం" అన్నాడు.

ఆయనదగ్గర సెలవుతీసుకుని బయటకొచ్చాము.

"యేమనుకుంటున్నావు?" అన్నాను.

"లోపం నాకవితల్లో కాదని, నేను గుర్తింపు కోరుకోవడంలో వుందని తెలిసింది. అంతేకాదు నేనెవరికోసమైతే రాస్తున్నానో వాళ్లభాషలో వాళ్లకర్థమయ్యేట్టుకూడా రాసే ప్రయత్నం చెయ్యచ్చనీ అర్థమైంది. పద వెళ్దాం" అన్నాడు చలపతి ముందుకు నడుస్తూ.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments